



దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక


# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని    తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ    సంపుటి :05    సంచిక :106  ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్  ఆదివారం 09-08-2026    పేజీలు : 4    వెల : రూ. 3/-

## సవాళ్లను ఎదుర్కోవడానికి విద్య ఉపయోగపడుతుంది

ఢిల్లీ: వికసిత్ భారత్ నిర్మాణంలో యువతే కీలకమని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. దేశ స్వప్నాన్ని యువత సాకారం చేస్తున్నారని, మన యువతను చూస్తే గర్వకారణంగా ఉందని అన్నారు. ఢిల్లీ ఐఐటీ స్నాతకోత్సవంలో మోడీ పాల్గొన్నారు. విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ప్రసంగించారు. విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, మరింత మంది అమ్మాయిలు పట్టాలు తీసుకుంటే బాగుండేదని అన్నారు. ఐఐటీలో ఇవాళ్టి నుండి తమ కొత్త ప్రయాణం ప్రారంభమైందని, కొత్త ఎఐ ఆవిష్కరణలు రూపొందుతున్నాయని తెలియజేశారు. ఎవరైతే వేగంగా నేర్చుకుంటారో వాళ్లు విజేతలుగా నిలుస్తారని, మార్పు అనేది సవాళ్లను, అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి విద్య ఉపయోగపడుతుందని, జీవితానికి పరీక్షలు, క్వశ్చన్ పేపర్ ఉండవని అన్నారు. జీవితం చాలా పరీక్షలు పెడుతోందని, అన్నింటిని నెగ్గాలని, ఎన్ని



కష్టాలు వచ్చినా అనుకున్న లక్ష్యం సాధించాలని సూచించారు. భవిష్యత్ భారత్ నిర్మాతలు విద్యార్థులేనని నరేంద్రమోడీ పేర్కొన్నారు.

## సీపీ సజ్జనార్‌పై ఫిర్యాదు..ట్రైనీ ఐపీఎస్ కేసులో ఊహించని మలుపు!




హైదరాబాద్, ట్రైనీ ఐపీఎస్ కేసులో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితునిగా ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డి హైదరాబాద్ సీపీ సజ్జనార్ పై కోర్టుకు లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు. తనను బెదిరించటంతోపాటు ఎన్ కౌంటర్ చేస్తానని భయపెట్టినట్టు అందులో పేర్కొన్నారు. హైదరాబాద్ లోని సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ట్రైనింగ్ లో ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డిపై తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ ఇటీవల అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

దర్యాప్తు అధికారులపై అసహనం..

దాంట్లో ఉదయ్ కృష్ణారెడ్డి తనపై లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేస్తానని బెదిరించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కేసులు నమోదు కాగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతితో ఆయనను గురువారం కస్టడీకి తీసుకున్నారు. శుక్రవారం కూడా ఉదయ్ కృష్ణారెడ్డిని ప్రశ్నించారు. అయితే, రెండు రోజులపాటు జరిపిన విచారణలో ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులు అడిగిన చాలా ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని సమాచారం. తనకు మహిళా ట్రైనీ ఐపీఎస్ తో పరిచయం ఉన్న మాట వాస్తవమేనని.. లైంగిక వేధింపులకు పాల్పడ్డానన్నది నిజం కాదని అన్నట్టు తెలిసింది. ఓ దశలో నన్నెందుకు వేధిస్తున్నారు.. నాతో ఏం చెప్పించాలనుకుంటున్నారు అని దర్యాప్తు అధికారులపై అసహనం వ్యక్తం చేసినట్టుగా సమాచారం.

కోర్టులో సంచలన ఆరోపణలు..

ఇక, కస్టడీ గడువు ముగియటంతో శుక్రవారం సాయంత్రం పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి మేజిస్ట్రేట్ కు లిఖితపూర్వక ఫిర్యాదును అందించారు. విచారణ సమయంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ తనను తీవ్రంగా బెదిరించారని.. ఓ దశలో ఎన్ కౌంటర్ చేస్తానని భయపెట్టారని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు లేని చోట నన్ను ప్రశ్నించారు. టాస్క్ ఫోర్స్ ఆఫీస్ కు తీసుకెళ్లి హింసించారని అందులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై మేజిస్ట్రేట్ తీవ్రంగా స్పందించారు. సీసీ కెమెరాలు లేని చోట విచారణ ఎలా జరుపుతారు? అంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రెండు రోజుల్లో పూర్తి వివరణ ఇవ్వాలని అత్తాపూర్ సీఐకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్




హైదరాబాద్ :నగరంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు చేపట్టనున్న స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మినిస్టర్ క్వార్టర్స్లో ఎఇఅ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రబాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు ఎంటమాలజీ విభాగం ఉపయోగిస్తున్న వివిధ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ దోమల నివారణకు విస్తృత చర్యలు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే?డ్రైడే' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ చేపడుతున్నాం. దోమల నివారణపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాంమని అన్నారు.వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేస్తున్నాం. ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. హైదరాబాద్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ద్వారా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ స్వీయ బాధ్యతతో తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెం గ్యూ, చికున్గున్యా వంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే హైదరాబాద్ను ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిద్దగలం. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమం. జీహెచ్ఎంసీ చేస్తున్న విజ్ఞప్తిని ప్రతి ఒక్కరూ పాటించి దోమల నివారణలో భాగస్వాములు కావాలని కోరుతు

### బంజారాహిల్స్లో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్,బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11 లోని ఓ భవనం సెల్లార్లో దారువల వైన్ మార్ట్ స్టాక్ స్టోరేజ్ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్లార్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి

## నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించాలి

నల్గొండ,జిల్లాలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన నీటిపారుదల సలహామండలి సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీతో పాటు మార్కెట్ కమిటీ, మున్సిపల్ చైర్మన్లు, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రస్తుత నీటి లభ్యత, రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

క్షేత్రస్థాయిలో వర్షపాతాన్ని పరిశీలించాలి

వర్షపాతాన్ని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని మంత్రి అధికారులకు సూచించారు. భూగర్భ జలాలను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. 'జలసిరి' కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణ అనుమతులకు ఇంకుడు గుంత తప్పనిసరి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షం కురిసిన ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని, వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటికే తొలి ప్రాధాన్యం

జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు, నీటి లభ్యత తదితర వివరాలను జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి సమావేశంలో వివరించారు.



ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో ఉన్న నీటి నిల్వలు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతాయని అధికారులు తెలిపారు. దీంతో తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. రానున్న రోజుల్లో కురిసే వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులకు వచ్చే నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వరి సాగుపై వ్యవసాయ శాఖ హెచ్చరిక

జిల్లాలో ప్రస్తుత నీటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ప్రాజెక్టులు, బోర్ల కింద అధికంగా వరి సాగు చేస్తే నీటి లభ్యత తగ్గిన దశలో పంట ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రానున్న కాలంలో బోర్లలోనూ భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. నీటి వనరుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ.. అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, సాగునీటి అవసరాలకు సమర్థంగా వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.

## సర్ దెబ్బకు 57వేల మంది లబ్ధిదారులు ఔట్..పశ్చిమ బెంగాల్ సర్కార్ నిర్ణయం



బెంగాల్: ఆధార్ మాదిరి ఓటరు కార్డు ను పథకాల మంజూరీ కోసం వినియోగించడం రాష్ట్ర ప్రభుత్వాలు మొదలు పెట్టాయి. గతంలో ఆధార్ ను ఎలా ఉపయోగించుకుని ఎన్ని పనులు చేయాలో అన్ని పనులు చేశారు. బీజేపీ ఏలుబడిలో దేశంలో కొన్ని రాష్ట్రాలు సర్ ను తమకు నచ్చిన విధంగా వినియోగించుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆవాస్ యోజన (పక్కా గృహ నిర్మాణ పథకం) లో ఒక వేయి కాదు రెండు వేలు కాదు ఏకంగా 57వేల మంది లబ్ధిదారుల పేర్లను తీసివేశారు.

సర్ –2025 ఆధారంగా ఇంత భారీ సంఖ్యలో పేర్లను తొలగించామని పశ్చిమ బెంగాల్ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దిలీప్ ఘోష్ మీడియాకు వెల్లడించారు.కేంద్ర ఎన్నికల కమిషన్ దేశ వ్యాప్తంగా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు విడతల్లో పూర్తి చేసిన ఎన్నికల కమిషన్ చివరి విడత కింద పలు రాష్ట్రాలలో సర్ నిర్వహిస్తున్నది. పశ్చి బెంగాల్ 2025 సంవత్సరంలో సర్ నిర్వహించి బోగస్, చనిపోయిన వారు, నివాసం మారిన వారు, ఒకటికి మించి ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను సుమారు 90 లక్షల వరకు తొలగించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సర్ -- 2025 ను వినియోగించుకుంటున్నది. ఈ ఓటరు జాబితా ఆధారంగా పక్కా గృహ నిర్మాణ పథకంలో 57వేల మంది లబ్ధిదారుల పేర్లను తొలగించారు. పథకం కింద ఎంపికైన వారి పేర్లు సర్ లో లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొలకతా లోని రాష్ట్ర సచివాలయంలో ఈ పథకం కింద ముఖ్యమంత్రి సువేంధు అధికారి 10 లక్షల 20వేల మంది లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేశారని ఘోష్ వెల్లడించారు. బంధుప్రీతి, అవినీతి కి పాల్పడి 2022 లో అప్పటి ప్రభుత్వ పెద్దలు రాష్ట్రంలో ప్రధాన మంత్రి అవాస యోజన కింద అనర్హులను ఎంపిక చేశారన్నారు. దీంతో కేంద్రానికి పలు ఫిర్యాదులు వెల్లడంతో నిధులు మంజూరు నిలిపివేసిందన్నారు. దీంతో అప్పటి మమతా బెనర్జీ ప్రభుత్వం సొంతంగా బంగ్లార్ బారీ పథకం 2024 సంవత్సరంలో ప్రారంభించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్వే నిర్వహించి బోగస్ లబ్ధిదారులను ఏరివేశామన్నారు. తాజాగా ఒక కోటి 20వేల మంది లబ్ధిదారులకు రెండో విడత కింద ఒక్కొక్కరికి రూ.60వేల చొప్పున విడుదల చేశామన్నారు. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు వడపోత కార్యక్రమం జరుగుతోందని, బంగ్లార్ బారీ పథకం పేరును బంగా అవాస్ యోజనగా మార్పు చేశామని దిలీప్ ఘోష్ వెల్లడించారు. బెంగాల్ లో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి సువేంధు అధికారి సర్ –2024 ఓటర్ల జాబితా ఆధారంగా సంక్షేమ, నగదు బదిలీ పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆధార్ బదులు సర్ జాబితాను ఆధారంగా మార్చుకున్నారు. ఇదే తరహాలో మహారాష్ట్ర, బిహార్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు సర్ ను ఆధారంగా చేసుకుని సంక్షేమ, నగదు బదిలీ పథకాలను అమలు చేస్తున్నాయి.

సర్కార్ ఉద్యోగులకు డీఏ పెంపు

బెంగాల్ లో దుర్గా పూజ ను ఘనంగా నిర్వహిస్తారు. దుర్గా పూజ కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ (కరవు భత్యం) పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆరవ వేతన సవరణ సంఘం సిఫారసు మేరకు మూల వేతనం (బేసిక్ పే) పై 38 శాతం డీఏ పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి పెరిగిన డీఏ అమలు చేయనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం మూలంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, పంచాయతీ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు, కార్పొరేషన్, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఏయిడెడ్ ఉద్యోగులకు డీఏ పెరగనున్నది. కనీస వేతనాల చట్టం కింద దినసరి వేతనంపై పనిచేసే వారికి ప్రస్తుతం చెల్లిస్తున్న మొత్తంపై అదనంగా ప్రతిరోజు రూ.110 పెంచుతూ అక్టోబర్ 1వ తేదీ నుంచి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రంలో అమలు చేస్తున్న డీఏ, రాష్ట్రంలో అమలు చేస్తున్న డీఏ కు మధ్య 42 శాతం వ్యత్యాసం ఉందని, దశల వారీగా వ్యత్యాసాన్ని తగ్గించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేస్తామని బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల ఒక సమావేశంలో వెల్లడించిన విషయం విధితమే. ఏడవ వేతన సంఘం సిఫారసులను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాలు, భత్యాలపై, సర్వీసు సమస్యలు, పెన్షనర్ల సమస్యలపై సంఘం అధ్యయనం చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఏడవ వేతన సంఘం సిఫారసులను 2027 సంవత్సరంలో అమలు చేస్తామని సువేంధు అధికారి పేర్కొన్నారు.

## రాహుల్‌గాంధీ వైఖరి మారినట్లుంది.. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ,మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్ ' కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని అన్నారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ లో ఈ అంశంపై మరింత వివరంగా పేర్కొన్నారు. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు.అప్పుడే దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. 'మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నా' అని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది.




## సంపాదకీయం

**ఆదివారం 09-08-2026**

# సంపన్న భారత్‌కు సుస్థిర పునాది

ఇటీవలి కాలంలో భారతదేశ ఆర్థికాభివృద్ధి గురించి ఎన్నడూ లేనంతగా ఆశావహ చర్చ జరుగుతోంది. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే అంచనాలు... సెమీకండక్టర్లు, ఏఐ, తయారీ రంగం, స్టార్టప్‌లు వంటి అంశాలన్నీ మన భవిష్యత్తు గురించి గొప్ప ఆశాభావాన్ని రేకెత్తిస్తున్నాయి. అయితే, ఈ చర్చల మధ్య ఒక ప్రశ్న అరుదుగా వినిపిస్తుంది. ఒక దేశం సంపన్నంగా ఎదగడానికి నిజమైన పునాది ఏంటి?- పెట్టుబడులా? సాంకేతికతా? ప్రభుత్వ విధానాలా? లేదంటే మరేదైనా ఉందా?ఒక దేశం సంపన్నంగా ఎలా మారగలదని ఆలోచిస్తే, భారత్‌లో కనిపించే రెండు విభిన్న ధోరణులు గుర్తుకువస్తాయి. ఒక వర్గం, పాశ్చాత్య దేశాలు అనుసరించిన మార్గాన్నే మనమూ అనుసరించాలని అంటుంది. మెరుగైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ, విదేశీ పెట్టుబడులు, ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, పరిశోధన, సాంకేతికత, నోబెల్ బహుమతులు- ఇవే అభివృద్ధికి మార్గాలని వారు విశ్వసిస్తారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, 'మరో అమెరికా' కావాలనేది వారి ఆకాంక్ష. మరో వర్గం ఏమో, భారతదేశపు ప్రాచీన వైభవాన్నీ, సంస్కృతినీ, భాషలనూ, తత్వశాస్త్రాన్నీ, సంప్రదాయ జ్ఞానాన్నీ తిరిగి కనుగొనాలని చెబుతుంది. మన మూలాలను మరచిపోతే అభివృద్ధి అసంపూర్ణమన్నది వీరి వాదన. సాధారణంగా ఈ రెండు వర్గాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. ఒకరిని ఒకరు అనుమానంతో చూస్తుంటారు. మొదటి వర్గానికి రెండో వర్గం ఎక్కడో గతంలోనే జీవిస్తున్నట్టు కనిపిస్తే, రెండో వర్గానికి మొదటి వర్గం మూలాలు లేని ఆధునికతను ఆరాధిస్తున్నట్లు అనిపిస్తుంది. కానీ, వాస్తవానికి ఈ విభేదమన్నదే ఒక భ్రమ!


రాజకీయ అభిప్రాయాలు వేరైనా...

ఆర్థికాభివృద్ధి, నాగరికత పరస్పర విరుద్ధమైనవేమీ కావు. అవి ఒకే పరిణామ క్రమంలో రెండు వేర్వేరు స్థాయిలు. ఆర్థికశాస్త్రం సంపదను ఎలా సృష్టించాలో చెబుతుంది. ఒక సమాజం తరతరాల పాటు సంపదను సృష్టిస్తూ వికాసం చెందడానికి కావాల్సిన మానసిక, సామాజిక పునాదిని నాగరికత నిర్మిస్తుంది. ప్రముఖ ఆర్థికవేత్త సంజీవ్ సన్యాల్ ఇటీవల ఒక ఆసక్తికరమైన అంశాన్ని ప్రస్తావించారు. శతాబ్దాల నాగరిక ఆత్మవిశ్వాసం కలిగిన సమాజాలు... స్థిరమైన ఆర్థికాభివృద్ధికి కూడా బలమైన పునాదులను నిర్మిస్తాయని ఆయన సూచించారు. చరిత్ర పట్ల గౌరవం, సంస్థల పట్ల విశ్వాసం, భవిష్యత్తు కోసం పెట్టుబడి పెట్టే దూరదృష్టి- ఇవన్నీ ఒక సంస్కృతిలోనే పెరుగుతాయి. మరోవైపు, గ్రీకు ఆర్థికవేత్త యానిస్ వరూఫాకిస్ పూర్తిగా భిన్నమైన రాజకీయ దృక్కోణానికి చెందినవారు. అయినాసరే, ఆయన కూడా ఆర్థిక వ్యవస్థలను కేవలం మార్కెట్లు, వడ్డీరేట్లు, ద్రవ్య విధానాలతో మాత్రమే అర్థం చేసుకోలేమని చెబుతారు. చరిత్ర, సామాజిక సంస్థలు, ప్రజలు తమ గురించి చెప్పుకొనే కథలు, సామూహిక విశ్వాసాలు వంటివన్నీ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగాలని ఆయన వివరిస్తారు. పైన చెప్పుకొన్న రెండు వర్గాల రాజకీయ అభిప్రాయాలు వేర్వేరు కావచ్చు. కానీ, ఒక విషయంలో మాత్రం వారి ఆలోచనలు కలుస్తాయి. ఆర్థికవ్యవస్థ శూన్యంలో పనిచేయదు. అది ఒక సంస్కృతిలో, ఒక నాగరికతలో, ఒక సామూహిక భావజాలంలో, విశ్వాసాలలో వేళ్లూనుకుని ఉంటుంది. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. సాంస్కృతిక గర్వమంటే నినాదాలు కాదు, గతాన్ని అతిశయోక్తులతో పొగడటమూ కాదు. ఇతరులను తక్కువగా చూడటం అసలే కాదు.

సాంస్కృతిక పునరుజ్జీవనం...

నిజమైన సాంస్కృతిక పునరుజ్జీవనం అంటే- మన భాషల్లో ఉన్నత విద్యను అందించడం. ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేయడం. విజ్ఞానాన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం. మన కళలనూ సాహిత్యాన్నీ జ్ఞానసంపదనూ ఆధునికంగా పునర్నిర్మించడం. ప్రపంచస్థాయిలో శాస్త్రసాంకేతిక పరిశోధనలను చేస్తూనే, మన నాగరికతతో అనుబంధాన్ని నిలుపుకోవడం. ఇటువంటి సాంస్కృతిక ఆత్మవిశ్వాసమే వ్యక్తిలో ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. ఆత్మగౌరవం సృజనాత్మకతను పెంపొందిస్తుంది. సృజనాత్మకత సంస్థలను నిర్మిస్తుంది. సంస్థలు సంపదను సృష్టిస్తాయి. అప్పుడు ఆర్థికాభివృద్ధి ఒక తాత్కాలిక అద్భుతం కాదు, తరతరాలపాటు కొనసాగే సజీవ సిరుల ప్రవంతిగా మారుతుంది. కొమ్మల మీద చెట్టు నిలబడదు, అది కనిపించని వేర్ల మీద నిలబడుతుంది. అలాగే ఒక దేశ ఆర్థికవ్యవస్థ కూడా కనిపించే పరిశ్రమలు, రహదారులు, కర్మాగారాల మీద మాత్రమే ఆధారపడదు. వాటికి శక్తినిచ్చే కనిపించని వేర్ల వంటి చరిత్ర, సంస్కృతి, భాష, విద్య, ఆత్మవిశ్వాసం వంటివాటిని ఆలంబనగా చేసుకుని ఎదుగుతుంది. వికసిత భారతాన్ని నిర్మించాలంటే మనకు బలమైన కొమ్మలు మాత్రమే కాదు, అంతకంటే బలమైన వేర్లు కూడా అవసరం!

# డీలిమిటేషన్ తర్వాత... మండల వ్యవస్థ కూడా మారాల్సి వస్తుందా?



న్యూఢిల్లీ,ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య పెరగడమే కాదు... భారత పరిపాలనా వ్యవస్థ కూడా కొత్త రూపు దాల్చాల్సిన సమయం వచ్చిందా?దేశవ్యాప్తంగా ప్రస్తుతం రెండు కీలక అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఒకటి మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే మహిళా రిజర్వేషన్, మరొకటి డీలిమిటేషన్. ఈ రెండు అంశాలు కేవలం పార్లమెంట్‌లో జరిగే చర్చలు మాత్రమే కావు. రాబోయే దశాబ్దాల్లో భారత ప్రజాస్వామ్యం, రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, పరిపాలనా నిర్మాణం ఎలా ఉండబోతుందో నిర్ణయించే చారిత్రాత్మక సంస్కరణలుగా ఇవి మారే అవకాశం ఉంది.డీలిమిటేషన్ గురించి మాట్లాడినప్పుడల్లా చర్చ ఎక్కువగా లోక్‌సభ స్థానాలు ఎన్ని పెరుగుతాయి? అసెంబ్లీ స్థానాలు ఎన్ని అవుతాయి? ఏ రాష్ట్రానికి లాభం? ఏ రాష్ట్రానికి నష్టం? అనే అంశాలకే పరిమితమవుతోంది. కానీ అసలు ప్రశ్న అక్కడి నుంచి ప్రారంభమవుతుంది.కొత్త నియోజకవర్గాలు వస్తే... మన పరిపాలనా వ్యవస్థ కూడా మారాల్సిన అవసరం వస్తుందా?ఇదే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు, పరిపాలనా నిపుణులు, విధాన నిర్ణేతలు ఆలోచించాల్సిన అంశం.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 679 మండలాలు ఉన్నాయి. తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు, దాదాపు 590 మండలాలు ఉన్నాయి. భవిష్యత్తులో డీలిమిటేషన్ అమలై అసెంబ్లీ స్థానాలు పెరిగితే, ఒక్కో ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించే జనాభా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో ఒక్కో నియోజకవర్గం భౌగోళిక పరిధి కూడా చిన్నదయ్యే అవకాశం ఉంది. దాని ప్రభావం ఎన్నికల రాజకీయాలపైనే కాదు, పరిపాలనపై కూడా పడుతు ంది.నేటికే అన్ని నియోజకవర్గాలు ఒకే విధంగా లేవు. ఉదాహరణకు చిత్తూరు జిల్లాలోని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిమిత సంఖ్యలో మండలాలతో ఉండగా, అదే జిల్లాలోని పూతలపట్టు నియోజకవర్గం మరిన్ని మండలాలను కలిగి ఉంటుంది. తెలంగాణలో కూడా ఇలాంటి ఉదాహరణలు కనిపిస్తాయి. మహబూబాబాద్ నియోజకవర్గం ఒక నిర్మాణంలో ఉండగా, డోర్నకల్ నియోజకవర్గం మరిన్ని మండలాలను కలిగి ఉంటుంది. అంటే నేటికే ప్రతి నియోజకవర్గం ఒకే నమూనాలో లేదని ఇది స్పష్టం చేస్తోంది. జనాభా, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని నియోజక వర్గాలు రూపొందించబడ్డాయి.ఒకవేళ భవిష్యత్తులో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరిగితే, ఒక్కో నియోజకవర్గం పరిధి సహజంగానే తగ్గే అవకాశం ఉంది. ప్రజలకు తమ ప్రజాప్రతినిధి మరింత చేరువ అవుతారు. స్థానిక సమస్య లపై ఎమ్మెల్యే దృష్టి మరింత కేంద్రీకృతం కావచ్చు. ప్రచారం కూడా చిన్న భౌగోళిక పరిధిలో జరిగే అవకాశం ఉంటుంది. అంటే డీలిమిటేషన్ అనేది కేవలం రాజకీయ గణితం కాదు; ప్రజాప్రతినిధులు పనిచేసే విధానాన్ని కూడా మార్చే సంస్కరణ.

అయితే ఇక్కడే మరో పెద్ద ప్రశ్న ముందుకు వస్తుంది.

1980వ దశకంలో రూపొందించిన మండల వ్యవస్థ... 2050 భారతదేశానికి కూడా సరిపోతుందా?1980వ దశకంలో పెద్ద తాలూకాలను విభజించి, ప్రభుత్వాన్ని గ్రామాలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండల వ్యవస్థను తీసుకొచ్చారు. ఆ కాలానికి అది ఒక గొప్ప పరిపాలనా సంస్కరణ. ప్రజలు తహసీల్దార్ కార్యాలయాలకు దూరంగా వెళ్లాల్సిన అవసరం తగ్గింది. ప్రభుత్వ సేవలు గ్రామీణ ప్రాంతాలకు మరింత దగ్గరయ్యాయి. ఆ నిర్ణయం తన కాలంలో ఒక విప్లవాత్మక పరిపాలనా మార్పు.కానీ నేటి భారతదేశం పూర్తిగా మారిపోయింది.గత నాలుగు దశాబ్దాల్లో జనాభా గణనీయంగా పెరిగింది. పట్టణీకరణ వేగవంతమైంది. అనేక గ్రామాలు పట్టణాలుగా మారాయి. మహానగరాల పరిధి పదుల కిలోమీటర్ల వరకు విస్తరించింది. కొత్త పారిశ్రామిక కారిడార్లు, ఐటీ నగరాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పడ్డాయి. రవాణా, సమాచార సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్---అన్నీ పూర్తిగా కొత్త దశలోకి ప్రవేశించాయి.ఇలాంటి రిస్థితుల్లో నలభై సంవత్సరాల క్రితం రూపొందించిన పరిపాలనా నమూనానే రాబోయే నలభై సంవత్సరాలకు కూడా సరిపోతుందా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.డీలిమిటేషన్ కమిషన్ కొత్త మండలాలను ఏర్పాటు చేయదు. అది ప్రస్తుతం ఉన్న పరిపాలనా సరిహద్దులను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను రూపొందిస్తుంది. అయితే కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతో పరిపాలనా అవసరాలు మారితే, రాష్ట్ర ప్రభుత్వాలు మండలాల పునర్వ్యవస్థీకరణ, కొత్త రెవెన్యూ డివిజన్లు, నగర ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలనా నమూనాలు వంటి అంశాలపై ఆలోచించాల్సిన పరిస్థితి రావచ్చు.ప్రత్యేకంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల చుట్టూ కొత్త పరిపాలనా యూనిట్లు అవసరమా? పెద్ద మండలాలను చిన్నవిగా విభజించాలా? రెవెన్యూ డివిజన్లను పెంచాలా? లేక తాలూకా నుంచి మండల వ్యవస్థకు మారినట్లే, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరో కొత్త పరిపాలనా నమూనాను రూపొందించాలా?ఈ ప్రశ్నలకు ఈరోజే సమాధానాలు ఉండకపోవచ్చు. అలాగే ఇవన్నీ తప్పకుండా జరుగుతాయని కూడా చెప్పలేం. కానీ ఇవాళ ఈ చర్చను ప్రారంభించడం మాత్రం అవసరం. ఎందుకంటే పరిపాలన ఎప్పుడూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మారుతూ ఉండాలి.మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ గురించి దేశమంతా చర్చిస్తోంది. కానీ ఈ రెండు సంస్కరణలతో పాటు మరో చర్చ కూడా ప్రారంభం కావాలి.భారతదేశం 2050 అవసరాలకు అనుగుణంగా మన పరిపాలనా వ్యవస్థ ఎలా ఉండాలి?అది కేవలం కొత్త ఎంపీలు, కొత్త ఎమ్మెల్యేలు, కొత్త నియోజకవర్గాల ప్రశ్న మాత్రమే కాదు. ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే పరిపాలనా నిర్మాణం ఎలా ఉండాలనే ప్రశ్న కూడా.ఒకప్పుడు తాలూకా వ్యవస్థ నుంచి మండల వ్యవస్థకు మారడం ఒక చారిత్రాత్మక సంస్కరణ అయితే, రేపు కూడా అలాంటి మరో పరిపాలనా సంస్కరణ అవసరమా అనే అంశంపై ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం ప్రారంభించాలి. రాజ్యాంగ నిపుణులు, పరిపాలనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణాభివృద్ధి నిపుణులు కలిసి భవిష్యత్తు భారతదేశానికి తగిన పరిపాలనా నమూనాపై ఆలోచించాల్సిన సమయం వచ్చింది. డీలిమిటేషన్‌ను కేవలం ఎన్నికల సంస్కరణగా మాత్రమే చూడకూడదు. అది భారతదేశ పరిపాలనా వ్యవస్థను వచ్చే 25-30 సంవత్సరాలకు సిద్ధం చేసే ఒక అరుదైన అవకాశంగా కూడా చూడాలి.ఎందుకంటే...మంచి ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎక్కువ మంది

# టార్గెట్ లోకేష్..


విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయం ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాలతో కొత్త మలుపు తిరగనుంది. ఇటీవల కాలంలో అధికార కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరిస్తూ వరుస ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అందులో ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాలపై అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయంటూ నిర్వహించిన నిరసనలు, సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వీధుల్లో పోరాడిన వైఎస్సార్‌సీపీకి, అభియోగాల్లో నిజాయితీ ఉంటే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రత్యక్ష చర్చకు దిగాలి అని అధికార పక్షం విసిరిన చాలెంజ్ ఇప్పుడు ప్రధాన రాజకీయ పరీక్షగా మారింది.మెగా డీఎస్సీ వివాదంపై పారదర్శకమైన చర్చ జరపాలనే విజ్ఞప్తులతో వైఎస్సార్‌సీపీ నేతలు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చడం ప్రతిపక్షానికి ఊహించని చట్టపరమైన షాక్‌గా మారింది. రాజకీయ లబ్ధి కోసం వేసే పిల్‌లను అనుమతించలేమని న్యాయస్థానం స్పష్టం చేయడంతో, ఈ అంశాన్ని న్యాయపోరాటం కంటే సభా వేదికగానే తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తమ పారదర్శకతను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతుండటంతో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ వేదికను వాడుకుంటుందా లేదా అనే అంశంపై సోషల్ మీడియా, రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి.అసెంబ్లీకి హాజరయ్యే విషయంలో వైఎస్సార్‌సీపీ ముందున్న అతిపెద్ద సవాలు ప్రతిపక్ష హోదా గుర్తింపు . తగినంత సంఖ్యాబలం లేదన్న కారణంతో స్పీకర్ స్థానం ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీ గత సమావేశాలను బహిష్కరించింది. అయితే, ఇప్పుడు డీఎస్సీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన ఉద్యమం చేతిలో ఉండటంతో, నిరసనను సభ బయటకే పరిమితం చేస్తే.. ప్రభుత్వ సవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే వైఎస్సార్‌సీపీ పారిపోయింది అని అధికార పక్షం ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు.మరోవైపు, అధికార కూటమి నేతలు సైతం శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని గణాంకాలతో నిలదీసేందుకు పక్కా నివేదికలతో సిద్ధమవుతున్నారు. తమ ప్రభుత్వంలో కల్పించిన ఉద్యోగ అవకాశాలు, స్పోర్ట్స్ కోటా పరిశీలన పద్ధతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సభ ముందు ఉంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే డీఎస్సీతో పాటు శాంతిభద్రతల అంశం, ఇటీవల ఎమ్మెల్యేల అరెస్టుల వ్యవహారాలపై ఉభయ పక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ముందు ప్రస్తుతం రెండు మార్గాలు మిగిలాయి. మొదటిది, పాత పద్ధతిలోనే సభా బహిష్కరణ కొనసాగించడం, రెండవది, నిరసన ముద్రను దాటుకుని సభా వేదికపైకి వచ్చి స్పీకర్ స్థానాన్ని ప్రశ్నిస్తూనే డీఎస్సీ అక్రమాలపై మంత్రి నారా లోకేష్‌ను నేరుగా నిలదీయడం. ఈ రెండింటిలో వైఎస్సార్‌సీపీ ఎంచుకునే వ్యూహం రాబోయే రోజుల్లో ఆ పార్టీ పొలిటికల్ మైలేజ్‌ను నిర్ణయించనుంది. ఈ అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటుందో లేక వీధిపోరాటాలకే తన వ్యూహాన్ని పరిమితం చేస్తుందో తెలియాలంటే ఈ నెల 17 వరకు వేచి చూడాల్సిందే. 2029 ఎన్నికల రేసులో ప్రధాన ప్రతిపక్షంగా తమ ఉనికిని మరింత బలంగా చాటుకోవడానికి వైఎస్సార్‌సీపీకి ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు. వీధి పోరాటాల నుంచి శాసనసభ సభా వేదికకు ఈ పోరాటాన్ని తీసుకెళ్లడమే ప్రజాస్వామ్యబద్ధంగా ఆ పార్టీకి ఎక్కువ పొలిటికల్ అడ్వాంటేజ్‌ను తెచ్చిపెడుతుందని రాజకీయ వర్గాల అంచనా.

## 56 శాతమే పూర్తయిన డిజిటైజేషన్

హైదరాబాద్, తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలానికి దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా దాదాపు 10 శాతం మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుంచి గల్లంతయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందకొడిగా సాగుతుండటం, అసెంబ్లీ నియోజకవర్గాల వ్యాప్తంగా లక్షలాది మందికి బిఎల్వోల ద్వారా నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ డేటా క్రోడీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చివరి క్షణంలో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణలను వేగంగా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణ ఐటీ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా మీ-సేవ కేంద్రాల్లో ఈ సర్టిఫికెట్లను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రాసెస్ పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఓట్ల తొలగింపు నోటీసులు రావడం, డిజిటైజేషన్ నమోదు కేవలం 56 శాతానికే పరిమితం కావడం నగర జనాభాను తీవ్ర అయోమయంలోకి నెట్టిందిఈ తీవ్ర విమర్శలు మరియు క్షేత్రస్థాయి విఫలతలపై కాంగ్రెస్ అధిష్టానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు బూత్ లెవెల్ ఏజెంట్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల ఓట్లను సక్రమంగా నమోదయ్యేలా చూడటంలో పర్యవేక్షణ లోపించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగడం సరికాదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు , నాయకుల పనితీరుపై హైకమాండ్ క్లాస్ తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కొన్ని కీలక నియోజకవర్గాల్లో పక్కా వ్యూహంతో కుట్రలు జరుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బలమున్న సాంప్రదాయ ఓటర్లను, బహుజన, మైనారిటీ , నిరుపేద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు, కొన్ని వర్గాలు కుట్రపూరితంగా పేర్లు తొలగించేలా బిఎల్వోల స్థాయిలోనే తప్పుడు రికార్డులు క్రియేట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ నగరంలో నత్తనడకన సాగుతున్న ప్రాసెస్, క్షేత్రస్థాయి ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తెలంగాణలో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ డెడ్‌లైన్‌ను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక షెడ్యూల్‌ను సవరించింది. కేంద్ర సీఈవో కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వచ్చి డోర్-టు-డోర్ సర్వేను, నియోజకవర్గాల వారీ డేటాను రీ-వెరిఫై చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ ఓటర్ల డేటా సమరం తెలంగాణ రాజకీయంలో కాంగ్రెస్ , ప్రతిపక్షాల మధ్య సరికొత్త వేడిని రగిల్చింది.

# వెల్లువెత్తుతున్న జనం.. జగన్ ప్రత్యర్థుల గుండెల్లో దడ!

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనిస్తే, దివంగత నేతలు ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత, ప్రజాదరణ కలిగిన నాయకుడు వైఎస్ జగన్. ఈ వాస్తవాన్ని ప్రత్యర్థులు సైతం అంగీకరిస్తారు. జగన్ ఎక్కడికెళ్లినా, వేలల్లో జనం కనిపిస్తుంటారు. ఇక రాయలసీమ, ఉత్తరాంధ్రలలో అయితే ప్రజాదరణ కాస్త ఎక్కువే. ఇందుకు సామాజిక, రాజకీయ సమీకరణలు కూడా కలిసొస్తాయని చెప్పొచ్చు.పులివెందులకు జగన్ వెళితే... ఇసుకేస్తే రాలనంత జనం. సొంత నియోజకవర్గం కదా, ఆ మాత్రం జనం వెళ్లరా అని ప్రత్యర్థులు అన్నారు. నెల్లూరు జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ వెళితే, తండోపతండాలుగా జనం వెళ్లారు. జగన్ సామాజిక వర్గం బలంగా ఉన్న నెల్లూరులో ఆ మాత్రం జనం రావడం ఆశ్చర్యం కాదని ప్రత్యర్థులు పెదవి విరిచారు.ఆ తర్వాత ప్రకాశం జిల్లాకు జగన్ వెళ్లారు. అదే జనహోరు. పక్క జిల్లాల నుంచి జనాన్ని తరలించారని ప్రత్యర్థులు ఆరోపించారు. మనసులో భయం ఉన్నా, జగన్‌పై జనాదరణను ప్రత్యర్థులు జీర్ణించుకోలేకపోయారు. ఆ తర్వాత పల్నాడు జిల్లా సత్తెనపల్లెలో పార్టీ కార్యకర్త విగ్రహావిష్కరణకు వెళితే, పోలీసుల అడ్డంకుల్ని అధిగమించి, బారికేడ్లను తోసుకుని , అలాగే పొలాల గట్లు, కాలిబాటల్లో జగన్ చూసేందుకు తరలి వెళ్లి, ఔరా అనిపించారు. ఆ సమయంలో జగన్‌పై జనాదరణ చర్చను పక్కదారి పట్టించేందుకు , ఆయన వాహనం కింద కార్యకర్త చనిపోయాడని తమదైన డైవర్షన్ రాజకీయానికి టీడీపీ తెరలేపింది. అయినప్పటికీ జగన్‌పై జనాదరణ పెరుగుతోందన్న వాస్తవాన్ని అంగీకరించలేకపోయారు.విజయవాడలో సాయికృష్ణ, క్రాంతికుమార్ ఇళ్లకు వెళ్లిన సందర్భాల్లోనూ అదే ఆదరణ. ఆ తర్వాత భీమవరంలో ఆక్వా రైతులతో మాట్లాడేందుకు జగన్ వెళితే, చీమల పుట్ట పగిలినట్టు , జనం హోరెత్తారు. జగన్‌పై జనం అభిమానం వెల్లువెత్తుతోందన్న సంకేతాలు వెళ్లాయి. కానీ ప్రతి జగన్ పర్యటనపై మీడియాని అడ్డుపెట్టుకుని టీడీపీ అవాకులు చెవాకులతో కూడిన ప్రేలాపనలు.ఇప్పుడు కూటమికి కంచుకోట లాంటి తూర్పుగోదావరి జిల్లాలో జగన్ పర్యటన. జగన్‌ను చూసి.. సీఎం.. సీఎం అంటూ నినాదాలు మార్మోగాయి. జగన్ కాన్వాయ్ ముందుకు సాగడానికి వీల్లేని పరిస్థితి. ఇప్పుడు జగన్‌పై జనాదరణ లేదని చెప్పడానికి, అదేమీ రాయలసీమ కాదు. కూటమి ఓటు బ్యాంక్ బలంగా వున్న తూర్పుగోదావరి జిల్లా. ఇంకా చెప్పాలంటే కూటమిలోని జనసేనకు అడ్డా. అయితే కూటలకు బీటలు పడ్డాయా? అనే అనుమానం కలిగేలా జగన్‌కు జనాదరణ లభించడం.... కూటమి నేతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.ఏపీలో ఉభయగోదావరి జిల్లాల్లో వైసీపీకి ఆదరణ, మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే కాస్త తక్కువే. దీన్ని వైసీపీ అంగీకరిస్తుంది. అలాంటి ప్రాంతంలో వైఎస్ జగన్ పర్యటిస్తే, ఇసుకేస్తే రాలనంత జనం. వేలాదిగా వెల్లువెత్తిన జనాన్ని చూస్తే, జగన్ ప్రత్యర్థుల్లో గుండె దడ తప్పదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం వైఎస్ జగన్ పర్యటించారు. పొగాకు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అక్కడికి జగన్ వెళ్లారు. పొగాకు కొనుగోలు కేంద్రానికి వెళ్లి, అక్కడ రైతులను అడిగి సమస్యలు తెలుసుకోవడం జగన్ పర్యటన ఉద్దేశం. వైఎస్ జగన్ రాక గురించి తెలుసుకున్న జనం, భారీ సంఖ్యలో అక్కడికి వెళ్లారు. చివరికి హెలిప్యాడ్ వద్దకు కూడా వేలాది మంది అభిమానులు వెళ్లడం విశేషం.హెలిప్యాడ్ నుంచి పొగాకు కొనుగోలు కేంద్రం వద్దకు రెండు కిలోమీటర్లు పైగా ప్రయాణించడానికి రెండు గంటల సమయం పట్టింది. దీన్నిబట్టి ఏ స్థాయిలో జనం అడుగడుగునా నీరాజనం పట్టారో అర్థం చేసుకోవచ్చు. ఏ రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం,



ఉత్తరాంధ్ర జిల్లాల్లో జనం పోటెత్తారంటే అర్థం చేసుకోవచ్చు.కానీ జనసేన, టీడీపీ కూటమి అత్యంత బలంగా ఉన్న జిల్లాలో జగన్‌కు లభించిన ప్రజాదరణ... ఏపీలో మారుతున్న రాజకీయ వాతావరణానికి సంకేతమనే చర్చకు తెరలేచింది. తూర్పు ఎటు మొగ్గితే, అటు అధికారమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వుంది. అలాంటి తూర్పుగోదావరి జిల్లాలో జగన్ పర్యటనకు వేలాది తరలి రావడం వైసీపీలో జోష్ నింపింది.ఇప్పటికే జగన్ ఎక్కడికెళ్లినా పెద్ద సంఖ్యలో జనం గుమికూడుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వుందనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ నేపథ్యంలో కూటమికి ప్రధాన ప్రత్యర్థి అయిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ వైపు ప్రజలు ఆకర్షితులవతున్నారనేందుకు ఆయన వద్దకు వివిధ రకాల బాధితులు వెళ్లడమే నిదర్శనమని అంటున్నారు. సమస్య ఉన్న చోటికి జగన్ వెళ్తుండడం, న్యాయం చేసేందుకు వైసీపీ శ్రేణుల్ని పోరుబాట పట్టించడంలో జగన్ చురుగ్గా వ్యవహరిస్తున్నారు.ఈ నేపథ్యంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతోంది. అందుకు తగ్గట్టుగా జగన్ పర్యటనలు విజయవంతం కావడం, ముఖ్యంగా టీడీపీలో ఆందోళన కలిగిస్తోంది. నిజానికి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటికీ వైసీపీని నాయకత్వ సమస్య వెంటాడుతోందన్న అభిప్రాయం వుంది. చాలా నియోజకవర్గాల్లో కొత్త నాయకత్వాలకు బాధ్యత అప్పగించాల్సి వుంది.అయితే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎవరనే విషయాన్ని జనం పట్టించుకోలేదు. జగన్ వస్తున్నాడంటే చాలు, పోలీసులు అడ్డంకుల్ని లెక్క చేయకుండా వివిధ మార్గాల్లో ఆయన్ను చూడడానికి వెళ్తుండడం ఆసక్తికర పరిణామం. వైసీపీపై జనాభిప్రాయానికి తూర్పులో జగన్ పర్యటనకు వెల్లువెత్తిన జనం ఒక ఉదాహరణగా పలువురు చెబుతున్నారు. ఈ జనమంతటిని ఓట్లుగా మలుచుకోవడం వైసీపీ చేతిలో వుంది.ప్రతిపక్ష నాయకుడి పర్యటన సక్సెస్ కావడం అంత ఈజీ కాదు. జనంలో ఆదరణ వుంటే తప్ప, స్వచ్ఛందంగా వెళ్లే పరిస్థితి తలెత్తదు. ఇదే సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పర్యటనల్లో జనం వెల్లువెత్తారంటే అర్థం చేసుకోవచ్చు. వ్యక్తుల కంటే పదవులకు ఆకర్షణ ఎక్కువ.ఇంకా మూడేళ్ల పాటు కూటమి అధికారంలో కొనసాగనుంది. దీంతో కూటమి నేతల పర్యటనల్లో జనం పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం కాదు. అలాంటిది అధికారంలోకి వస్తారో, రారో ఇంకా తెలియని, అది కూడా అత్యంత ఘోర పరాజయాన్ని మూటకట్టుకున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పుడు ఎక్కడికెళ్లినా, జనం పోటెత్తడం తప్పకుండా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మళ్లీ వైసీపీ అధికారంలోకి రాబోతోందన్న సంకేతాల్ని ఇటు రాయలసీమ, అటు ఉత్తరాంధ్రతో పాటు మధ్యలో ఉన్న కోస్తాంధ్రలలో జగన్ పర్యటనకు వెల్లువెత్తుతన్న జనసందోహమే ఇస్తోంది.

## వర్షాలకు గుడిసె నేలమట్టం.. తప్పిన ప్రాణాపాయం

కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గెళ్ళ చంద్ర మొగిలికి చెందిన గుడిసె పూర్తిగా తడిసి కూలి నేలమట్టమైంది. గుడిసె కూలిన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ, అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.సమాచారం అందుకున్న కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు వేముగంటి శ్రావణ్ రెడ్డి, 4వ వార్డు సభ్యులు వేముగంటి మల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెన్నపురెడ్డి మహేష్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా

# ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

హైదరాబాద్, ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు. ఈ క్రమంలోనే విఖ్యాత్ సింగ్ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విఖ్యాత్ సింగ్ చెప్పినట్లు పిల్లల పెంపకం ప్రస్తుతం ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని కొందరు నెటిజన్లు అంగీకరిస్తూ పోస్టులు పెడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం ఖండిస్తున్నారు. అన్నీ డబ్బుతోనే ముడిపెట్టకూడదని హితవు పలుకుతున్నారు. పిల్లలు ఇచ్చే ఆనందం, ప్రేమ, కుటుంబానికి వచ్చే సంతోషాన్ని ఎంత డబ్బుతో అయినా కొలవలేమని పేర్కొంటున్నారు. పిల్లల వల్ల కలిగే ఆనందానికి ఎలాంటి విలువ కట్టలేమని పలువురు నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## చింతలపూడిలో కుంకుమపువ్వు సాగు

ఏలూరు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కుంకుమ పువ్వు సాగు చేయాలని నిర్ణయించింది. కుంకుమ పువ్వు సాగుకు సంబంధించి చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సాగు దిశగా చర్యలు తీసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగు చేయాలని ప్లాన్ చేశారు. అనుమతులు రాగానే కుంకుమ పువ్వును సాగు చేసేందుకు 30 ఎకరాల భూమిని కేటాయించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కుంకుమ పువ్వు సాగు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో ప్రయోగాత్మకంగా సాగు చేయగా మంచి ఫలితాలు రావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా కుంకుమ పువ్వు సాగు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగుకు కేటాయించాలని భావిస్తోంది. వాస్తవానికి ముందు లంగసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగు చేద్దామని భావించారు.. కానీ అక్కడ అనువైన భూమి లేకపోవడంతో చింతపల్లిలో సాగు చేయాలని నిర్ణయించారు.చింతపల్లిలో కుంకు పువ్వు సాగుకు సంబంధించి శాస్త్రవేత్తలు రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో మూడు వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. చింతపల్లిలో కుంకుమ పువ్వు సాగుకు.. కృష్ణా జిల్లాకు చెందిన 'స్పాన్ గ్రీన్‌వ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ముందుకు వచ్చింది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఏపీ ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగు కోసం కేటాయించే 30 ఎకరాల్లో.. 18 ఎకరాల్లో సాగు ఉంటుంది, 3 ఎకరాల్లో ఇండోర్ పర్యావరణ పరిరక్షణ, మిగిలిన 9 ఎకరాల్లో ప్రాసెసింగ్, పరిశోధన, శిక్షణ, పరిపాలనా భవనాలు వంటి వాటి కోసం కేటాయించారు.కుంకుమ పువ్వు సాగు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసిన వారికి కూడా మంచి అనుభవం ఉంది అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుని చింతపల్లిలో కుంకుమపువ్వు సాగుకు అడుగులు వేస్తోంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సుగంధ ద్రవ్య బోర్డు, సెంట్రల్ ధృవీకరణ, ఉద్యానవన శాఖ నుంచి అనుమతులు రాగానే భూమిని అధికారికంగా కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్? వంటి చల్లని ప్రాంతాల్లో ఎక్కువగా కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు. మనకు 100 టన్నుల డిమాండ్ ఉంటే.. దేశీయంగా కేవలం 3.46 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి 300 టన్నులు ఉంటే.. ఇరాన్?, స్పెయిన్ దేశాలు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

## అనగానికి రాజకీయ ఇబ్బందులు

గుంటూరు, తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రధాన అనుచరుడు గూడపాటి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరడం ఒకరకంగా షాక్ అని చెప్పాలి. మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన పార్టీని వీడుతూ, వైసీపీ కాంగ్రెస్ పార్టీ అధినేతను కలిసి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. రేపల్లె టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ వీడటం కేవలం తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశానని చెప్పారు. అనగాని సత్యప్రసాద్ వరసగా మూడు సార్లు రేపల్లె నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో తొలిసారి గెలిచిన అనగాని సత్యప్రసాద్ తర్వాత 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ విక్టరీని కొట్టారు. ఈ విజయం వెనక గూడపాటి కష్టం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువవుతుందని, పార్టీ కోసం, ఆయన గెలుపు కోసం పనిచేసిన తనను మంత్రి అయిన తర్వాత పట్టించుకోవడం లేదని గూడపాటి శ్రీనివాసరావు అనుచరులు చెబుతున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు గూడపాటి హుందాగా చెప్పడం విశేషం.

# హసీనా అప్పగింత సాధ్యమా?



న్యూఢిల్లీ,రెండేళ్ల క్రితం ఉవ్వెత్తున ఎగిసిపడిన విద్యార్థి ఉద్యమాన్ని అదుపుచేయటం అసాధ్యమని తేలాక హెలికాప్టర్‌లో అక్కడినుంచి నిష్క్రమించి భారత్‌లో ఆశ్రయం పొందిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సరిగ్గా ఆ తేదీనే ఎంచుకుని తొలిసారి బుధవారం మీడియాతో మాట్లాడారు. వచ్చే డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్లబోతున్నానని గతంలో చెప్పిన మాటనే పునరుద్ఘాటించారు. తనను జైల్లో బంధిస్తారని తెలిసినా, ఉరికంబం తన కోసం ఎదురు చూస్తున్నదని అర్థమైనా తిరిగి వెళ్లటానికే ఆమె సంసిద్ధులవుతున్నారు. దేశానికి సారథ్యంవహించే నాయకత్వానికి పరిణతి లోపిస్తే కక్ష సాధింపులే సమర్థతగా అనిపిస్తాయి.సాధించిన స్వాతంత్ర్యం అర్థరహితమవుతుంది. ఇది బంగ్లాదేశ్ ప్రస్తుత నాయకత్వానికి మాత్రమే కాదు... హసీనాతోసహా బంగ్లా మాజీ పాలకులందరికీ వర్తిస్తుంది. ఆ మాట కొస్తే పాకిస్తాన్ పరిస్థితి కూడా మొదటినుంచీ ఇంతే. అదృష్టవశాత్తూ మన దేశంలో స్వాతంత్ర్యోద్యమ నాయకత్వం నుంచి తొలి తరం సారథులు రావటంవల్ల కావొచ్చు...ఆ బెడద లేదు. ఇక్కడ సైతం ఆ పోకడలు తలెత్తుతూనే ఉన్నా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తమై వాటిని తిప్పికొడుతూనే ఉన్నారు. బంగ్లాదేశ్‌లో తనకెదురైన దుఃస్థితికి హసీనా తనను తానే నిందించుకోవాలి. ప్రజలు మెచ్చి అధికారం కట్టబెట్టాక ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారు. జీడీపీ పెరిగింది. అంతక్రితంతో పోలిస్తే ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. కానీ ఆ అధికారాన్ని శాశ్వతం చేసుకోవటానికి ఆమె వేసిన ఎత్తుగడలు అవధులు మీరాయి. వస్తున్న మెజారిటీ చాలదనుకుని ఎన్నికల ఫలితాలు ఏమార్చారు. చివరకు మొత్తం ఎన్నికలే రిగ్గింగ్ చేసే స్థాయికి దిగజారారు. మతోన్మాద శక్తుల ఆటకట్టించేందుకు చర్యలు తీసుకున్నా, సహేతుకమైన అసమ్మతికి సైతం ముద్రలేసి పబ్బం గడుపుకోవాలనుకున్నారు. మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) అధినేత బేగం ఖలీదా జియాను అవినీతి ఆరోపణలతో దీర్ఘకాలం చెరసాలపాలు చేశారు. ఖలీదా సైతం అంతే. తాను రాజ్యమేలిన మూడు దఫాలూ కక్షసాధింపు రాజకీయాల్లోనే మునిగితేలారు. ఆమె కుమారుడు, ప్రస్తుత ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ఆ వారసత్వాన్నే కొనసాగించదల్చుకున్నట్టు కనబడుతోంది. హసీనా సర్కార్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసులు, సైన్యం జరిపిన కాల్పుల్లో 1,400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి లెక్కలే చెబుతున్నాయి. నిజమే కావొచ్చు. జరిగిన తప్పిదాలకు ఆమె బాధ్యత వహించాల్సిందే. కానీ న్యాయవ్యవస్థను మహ్మద్ యూనస్ సలహాదారుగా ఉన్న తాత్కాలిక ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. మతతత్వవాదులు రెచ్చిపోయి హసీనా ఏలుబడిలోని న్యాయమూర్తుల్ని వేధించి రాజీనామాలు చేయించారు. ఉన్నతాధికారుల్ని అరెస్టు చేశారు. హిందూ మైనారిటీల ఇళ్లపై దాడులకు దిగారు. ఇలాంటి వాతావరణంలో జరిగిన విచారణకు విశ్వసనీయత ఉంటుందా?హసీనాను అప్పగించటంలేదన్న ఆగ్రహం బంగ్లాకు ఉంది. ఇదేమీ అసహజం కాదు. కానీ అధికారంలోకొచ్చాక భారత్‌ను రెచ్చగొట్టేలా తారిఖ్ రెహ్మాన్ చర్యలుంటున్నాయి. జూన్‌లో చైనాలో నాలుగు రోజులు పర్యటించి, 17 ఒప్పందాలు కుదుర్చుకున్నారు. '2o2 డైలాగ్' పేరిట విదేశాంగ విధానాన్నీ, భద్రతనూ నిర్ణీత వ్యవధిలో చర్చించుకుంటూ ఉండాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. అమెరికాతో ఆయన సాన్నిహిత్యం తెలియందేమీ కాదు. బంగ్లాలో అలజడుల వెనక అమెరికా పాత్ర జగద్విదితం. ఇదిగాక భారత్‌కు సన్నిహితమైతే విపక్షమైన జమాతే ఇస్లామీ బలపడుతుందేమోనన్న భయంతో రెహ్మాన్ మనవైపు కన్నెత్తి చూడటానికే సాహసించటం లేదు. ఇలాంటి స్థితిలో హసీనాను భారత్ అప్పగిస్తుందని ఆ దేశం అనుకోవటం హాస్యాస్పదం. అందరి మాదిరే మన దేశం ఎటూ స్వీయప్రయోజనాలు చూసుకుంటుంది. దౌత్యరంగంలో ఎప్పుడూ పరిస్థితులు ఒకేలా ఉండవు. బంగ్లా చిత్తశుద్ధితో వ్యవహరిస్తే, ఇంటా బయటా భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే అత్యుత్సాహాన్ని ఆపుకుంటే ఏ సమస్య అయినా తప్పక పరిష్కారమవుతుంది. అంతకన్నా ముందు హసీనా కుమారుడు ఈ మీడియా సదస్సులో ఆరోపించినట్టు బంగ్లా మరో పాకిస్తాన్‌గా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత రెహ్మాన్‌కుంది.

# ఈ-కేవైసీ..సంక్షేమానికి పరీక్ష!



హైదరాబాద్,తెలంగాణలో రేషన్ కార్డుల ఈ-కేవైసీ అమలులో వలస కార్మికులు, విద్యార్థులు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఐరిస్ స్కానింగ్ అవసరం, ప్రత్యామ్నాయ ధృవీకరణ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అనుకూలమైన డిజిటల్ పాలన అవసరం..

ఈ-కేవైసీ.. సంక్షేమానికి పరీక్ష!

రేషన్ కార్డుల ఈ-కేవైసీని తప్పనిసరి చేయడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని ఎవరూ తప్పుబట్టలేరు.. నకిలీ లబ్ధిదారులను గుర్తించడం, అర్హులకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందించడం, ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా మార్చడం దీని లక్ష్యం. అయితే ప్రతి సంస్కరణ ప్రజల జీవన వాస్తవాలకు అనుగుణంగా అమలైతేనే దాని అసలు ప్రయోజనం కనిపిస్తుంది.

గడువులోగా వలస కార్మికులు వచ్చేనా..?

ప్రస్తుతం ఈ-కేవైసీ అమలులో అలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. డిజిటల్ వ్యవస్థ ప్రజలకు సౌలభ్యం కల్పించాలే తప్ప, అర్హులకు అడ్డంకి కాకూడదు.. ఈ-కేవైసీ గడుపు ఇటీవల పెంచినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.. తెలంగాణ నుంచి ఉపాధి కోసం ముంబై, పూణె, బెంగళూరు, సూరత్, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లిన వలస కార్మికులు గడువులోగా స్వగ్రామాలకు చేరుకోవడం సాధ్యం కాని పరిస్థితి ఉంది. అలాగే ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఈ-కేవైసీ కోసం స్వగ్రామంలోని రేషన్ దుకాణానికి రావాల్సి వస్తోంది. కుటుంబంలోని ఒక్క సభ్యుడు బయట ఉన్నా మొత్తం కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

వేలిముద్రలను స్కానింగ్ గుర్తించదు..

వృద్ధుల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. వయస్సు ప్రభావంతో చాలామందికి వేలిముద్రలు స్కానింగ్‌లో నమోదు కావడం లేదు.. డీలర్లు పలుమార్లు ప్రయత్నించినా యంత్రం గుర్తించక పోవడంతో వారు కూడా వేలిముద్ర రావడం లేదు. మేమేం చేయలేం.. అనే సమాధానమే చెబుతున్నారు. దీనికి రేషన్ డీలర్లను బాధ్యులను చేయడం సరికాదు. అసలు ప్రశ్న పౌర సరఫరాల శాఖ ముందుంది. ఆధార్ వ్యవస్థలో ఐరిస్ (కనుగుడ్డు) ద్వారా ధృవీకరణకు అవకాశం ఉన్నప్పటికీ, రేషన్ దుకాణాల్లో ఐరిస్ స్కానింగ్ పరికరాలు లేకపోవడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లోటును అత్యవసరంగా సరి చేయాల్సిన అవసరం ఉంది.

ఈ-కేవైసీ రేషన్ దుకాణాలకే పరిమితమా?

మరో కీలక అంశం ఈ-కేవైసీని కేవలం రేషన్ దుకాణాలకే పరిమితం చేయడం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాలు, ఆధార్ సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బయోమెట్రిక్ సేవలు అందిస్తున్నాయి.. ప్రభుత్వం అనుమతించిన ఈ కేంద్రాల్లో కూడా వేలిముద్ర లేదా ఐరిస్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తే వలస కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు ప్రయాణ భారం, సమయ నష్టం తగ్గుతుంది. దేశంలో 'వన్ నేషన్--వన్ రేషన్ కార్డ్' అమల్లో ఉన్నప్పుడు, మరో రాష్ట్రంలో రేషన్ పొందగలిగే లబ్ధిదారుడు అక్కడి నుంచే ఈ-కేవైసీ పూర్తి చేసుకునే సౌకర్యాన్ని కూడా పరిశీలించాల్సిన సమయం వచ్చింది. డిజిటల్ పాలన అంటే కేవలం బయోమెట్రిక్ ధృవీకరణ కాదు.. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యామ్నాయాలను కూడా కల్పించడం. సంక్షేమ పథకాల లక్ష్యం అర్హులను జాబితా నుంచి తొలగించడం కాదు. అర్హులందరికీ హక్కుగా ప్రయోజనాలు అందించడం.

అది వృద్ధుడి తప్పు కాదే..!

అందుకే పౌర సరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ ఈ అంశాన్ని అత్యవసరంగా సమీక్షించి ఐరిస్ స్కానింగ్ పరికరాల ఏర్పాటు, మీసేవ-సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఈ-కేవైసీ సదుపాయం, వలస కార్మికులు, విద్యార్థులు, వృద్ధులకు ప్రత్యేక వెసులుబాటు వంటి అంశాలపై నిర్ణయం తీసుకోవాలి. వేలిముద్ర పడకపోవడం వృద్ధుడి తప్పు కాదు. ఉపాధి కోసం వలస వెళ్లడం కార్మికుడి నేరం కాదు. చదువు కోసం స్వగ్రామానికి దూరంగా ఉండడం విద్యార్థి పొరపాటు కాదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను మార్చినప్పుడే డిజిటల్ సంక్షేమ పాలన తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుంది.

# సరళా సాగర్ ప్రాజెక్టు...

వరంగల్, తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి?నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి?నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది.1940 చివరలో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ టెక్నాలజీని చూసిన తర్వాత, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించారు. తల్లి సరళాదేవి పేరు మీద ఈ ఆనకట్టకు పేరు పెట్టారు. 1949లో పునాదులు వేయబడి 1959లో పూర్తయిన ఈ ప్రాజెక్టు స్వాతంత్ర్యానంతర కాలంలోనే సాగునీటి రంగంలో కొత్త మార్గం చూపింది. ఇది కేవలం నీటి నిల్వ కాకుండా, మానవ ప్రమేయం లేని ఆటోమేటిక్ వ్యవస్థగా రూపొందింది.సాధారణ ఆనకట్టల్లో గేట్లు తెరిచి మూయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని గొట్టాలు (సైఫన్లు) అమర్చబడ్డాయి. ఇవి ఫిజిక్స్‌లోని వాక్యూమ్ సూత్రం మీద ఆధారపడి పనిచేస్తాయి. డ్యాంలో నీటి మట్టం నిర్ణీత స్థాయిని దాటగానే గొట్టాల్లోకి నీరు చేరుతుంది. మరింత పెరిగితే గాలి పూర్తిగా బయటకు వెళ్లి శూన్యత ఏర్పడుతుంది. ఆ ప్రెజర్ తేడా వల్ల నీరు వేగంగా కిందకు లాగబడి నదిలోకి ప్రవహిస్తుంది. నీటి మట్టం తగ్గగానే గాలి తిరిగి ప్రవేశించి ప్రవాహం ఆగిపోతుంది. ఇలా గేట్లు, మోటార్లు లేదా మానవ నియంత్రణ అవసరం లేకుండా పూర్తి స్వయంచాలకంగా నడుస్తుంది.ఆసియాలో ఇలాంటి సైఫన్ వ్యవస్థ ఉన్న ప్రాజెక్టుల్లో ఇది రెండోది. చిన్న సామర్థ్యం (సుమారు 0.5 టీఎంసీ) ఉన్నప్పటికీ, వేల ఎకరాల సాగుకు మద్దతు ఇస్తూ స్థిరమైన నీటి నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు స్థానిక రైతులకు జీవనాధారంగా మారింది. వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను నిర్ధారించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచింది. ఇలాంటి సహజ ఆధారిత పరిష్కారాలు నేటి కాలంలో మరింత అవసరం. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరళా సాగర్ లాంటి మోడళ్లు స్ఫూర్తినిస్తాయి.ఈ వ్యవస్థ గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి ప్రాథమిక సూత్రాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. నీరు పైనుంచి కిందకు ప్రవహించే సహజ ధోరణిని నియంత్రించడం ద్వారా వరద నీటిని సురక్షితంగా విడుదల చేస్తుంది. ఇది పర్యావరణపరంగా కూడా లాభదాయకం. విద్యుత్ వినియోగం లేకపోవడం, యంత్రాల నిర్వహణ ఖర్చు తగ్గడం, దీర్ఘకాలిక మన్నిక పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఆధునిక ఇంజనీర్లు ఈ సాంకేతికతను చూసి ఆశ్చర్యపోవడం సహజం, ఎందుకంటే ఇప్పటి అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ నియంత్రణలు లేకుండానే దశాబ్దాలుగా నమ్మకంగా పనిచేస్తోంది.

## తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది.ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి.ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ 44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది.ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

## గుడివాడలోకి కొడాలి ఎంట్రీ

విజయవాడ,మాజీ మంత్రి కొడాలని రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకం అయ్యారు. వైసీపీ అధినేతను కలవడం, ప్రభుత్వాన్ని విమర్శించడం వంటి పరిణామాలతో ఆయన గుడివాడ రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో ఇటీవల కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు.కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా చంద్రబాబు పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.గుడివాడ రాజకీయాల్లో మళ్లీ తన మార్క్ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. గుడివాడలోవరసగా గెలిచిన కొడాలి నాని గత ఎన్నికల్లో కూటమి గాలిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్ కే పరిమితమయ్యారు.కొడాలి నాని పై అనేక కేసులు నమోదయ్యాయి. అప్పుడప్పుడు గుడివాడకు రావడం పోలీసు స్టేషన్ కు వచ్చి హాజరు కావడం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. అలాంటి కొడాలి నాని తిరిగి గుడివాడలో వైసీపీ బలోపేతానికి ఆయన సిద్ధమయ్యారని తెలిసింది. మొన్నా మధ్య కొడాలి నాని తన రాజకీయ వారసుడిగా తన సోదరుడి కుమారుడిని ప్రకటించారు. తన రాజకీయ వారసుడిగా తన తమ్ముడి కుమారుడైన కొడాలి అర్జున్ పేరును ప్రకటించారు. నానికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారికి రాజకీయాలపై ఆసక్తి లేకపోవడంతో సోదరుడి కుమారుడిని వారసుడిగా ఎంపిక చేశారు. రాజకొడాలి అర్జున్ 2029 ఎన్నికల్లో కొడాలి నాని స్వయంగా గుడివాడ బరిలో నిలవనుండగా, ఆ తర్వాత 2034 ఎన్నికల్లో అర్జున్ రాజకీయ రంగప్రవేశం చేస్తారని స్పష్టమైందిస్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండగా కొడాలి నాని మళ్లీ యాక్టివ్ అయ్యారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసి పనిచేయాలని సూచించారు. కేసులు పెట్టి జైల్లో వేస్తే నెల లేదా ఆరు నెలలు ఉంటామని, తర్వాత బయటకు వస్తామని కొడాలి నాని అన్నారు. అంతే కాదు స్థానికసంస్థల ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో ఎక్కడా ఏకగ్రీవం కానివ్వబోమని ప్రకటించారు. అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు పోటీ చేస్తారని కొడాలి నాని ప్రకటించారు. గుడివాడలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కొడాలి నాని మాట్లాడుతూ తాను కూడా ఇక కార్యకర్తల చెంతనే ఉంటానని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ఇక వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన చెప్పడంతో ఇక గుడివాడ అడ్డాగా కొడాలి నాని పనిచేస్తారని ఆయన అనుచరులు చెబుతుతున్నారు.

## ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

న్యూఢిల్లీ,ఎన్డీఏలో ఇటీవల చేరిన ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పలు కీలక సూచనలు చేశారు. శుక్రవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహారం సందర్భంగా 45 మంది ఎంపీలతో దాదాపు గంట పాటు సమావేశమయ్యారు. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నుంచి ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేరిన ఎంపీలు, తృణమూల్ రెబెల్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "కొత్త పార్టీ అని ఆందోళన చెందొద్దు. మీకు నేనున్నాను. ఎన్డీఏ కుటుంబంలో ప్రతి వ్యక్తికి గౌరవం, రాజకీయాల్లో అవకాశం ఇస్తాం" అన్నారు. ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి తన మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీలు తమ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేయాలని.. తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని మోదీ పేర్కొన్నారు. ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా పీఎంఓను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు, యువతకు నిరంతరం అందుబాటులో ఉంటూ.. వారి కోసం పని చేయాలని తెలిపారు. పార్లమెంట్‌ను 'ప్రజాస్వామ్యానికి సర్వోన్నత దేవాలయం'గా అభివర్ణించారు. దాని చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. లోక్‌సభ చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని.. ప్రతిపక్ష సభ్యులతో సత్సంబంధాలు కొనసాగించాలని పేర్కొన్నారు.అమ్మ ఎలా ఉన్నారు..? : ఎంపీలు అందరినీ వ్యక్తిగతంగా పలకరించిన ప్రధాని.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్రా పవార్ క్షేమ సమాచారం గురించి ఎంపీ పార్థ్ పవార్ (ఆమె కొడుకు)ను అడిగి తెలుసుకున్నారు. అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పార్థ్ పవార్ తండ్రి.. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే.

# 482 కోట్ల ఖర్చులకు 38 వేల కోట్ల పెట్టుబడులు..మోడీ టూర్ పై రాజ్యసభలో కేంద్రం

న్యూఢిల్లీ, భారత విదేశాంగ విధానం, ఆర్థిక దౌత్యంలో ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటూ వచ్చాయి. తాజాగా ఈ పర్యటనల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు, అదే కాలంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మధ్య ఉన్న ఆసక్తికరమైన నిష్పత్తిని రాజ్యసభలో వెల్లడించిన లెక్కలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. 2021 నుంచి 2025 మధ్య కాలంలో ప్రధాని పర్యటనల కోసం వెచ్చించిన ప్రతి రూపాయికి , దేశానికి సుమారు 66వేల రూపాయల ఎఫ్‌డీఐ లభించినట్టు ఈ లెక్కలు చెబుతున్నాయి. రాజ్యసభలో సమర్పించిన సమాచారం ప్రకారం, ఏప్రిల్ 2021 నుంచి డిసెంబర్ 2025 మధ్య కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల కోసం ప్రభుత్వం మొత్తం 482.92 కోట్లు ఖర్చు చేసింది. ఇదే కాలంలో భారత్‌కు అందిన మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 381.8 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలోకి మార్చి చూస్తే మొత్తం పెట్టుబడుల విలువ దాదాపు 31, 69లక్షల కోట్లు అవుతుంది. ఈ రెండు లెక్కలు చూస్తే ప్రధాని పర్యటనలపై పెట్టిన ప్రతి ఒక రూపాయి ఖర్చుకు దేశానికి 65, 620 రూపాయలు పెట్టుబడిగా వచ్చినట్టు స్పష్టమవుతోంది. కరోనా మహమ్మారి తర్వాత అంతర్జాతీయ దౌత్య సంబంధాలు మళ్లీ పుంజుకోవడంతో ప్రధాన పర్యటనల ఖర్చు కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2021లో మూడు పర్యటనల ఖర్చు రూ. 36.12. 2022లో ఏడు పర్యటనలు చేశారు. దీని కోసం 55. 83 కోట్లు ఖర్చు చేశారు. 2023లో ఆరు దేశాల్లో పర్యటనకు అయిన ఖర్చు 93. 63 కోట్లు. 2024లో 109.51 కోట్లు ఖర్చు చేసి 11దేశాల్లో పర్యటించారు. 2025లో 187.83 కోట్లతో 11



పర్యటనలు చేశారు. 2026 జూన్ వరకు ఆరు పర్యటనలు చేశారు. దీని కోసం చేసిన ఖర్చు 187.33 కోట్లు. మొత్తంగా ఏప్రిల్ 2021 నుంచి డిసెంబర్2025 వరకు ప్రధాని మొత్తంగా 38 పర్యటనలు చేశారు. ప్రధాని పర్యటనలు కేవలం దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలకే పరిమితం కాలేదని, అవి ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ పర్యటనల సందర్భంగా కుదుర్చుకున్న ఎంవోయూలు వివిధ రంగాల్లో విదేశీ పెట్టబడులకు మార్గం సుగమం చేస్తున్నాయని వెల్లడించింది. అయితే ఈ లెక్కలను విశ్లేషించేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రధాని పర్యటనల ఖర్చుకు, వచ్చిన పెట్టుబడులకు మధ్య చూపిస్తున్న కేవలం ఒక పోలిక మాత్రమే. వచ్చిన పెట్టుబడులన్నీ నేరుగా ప్రధాని పర్యటన ద్వారా వచ్చినవని ప్రభుత్వం ఎక్కడా నేరుగా చెప్పలేదు. విదేశీ పెట్టబడులు అనేది దేశ ఆర్థిక విధానాలు, మార్కెట్ పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక గమనంపై కూడా ఆధారపడి ఉంటాయి.

# ఢిల్లీ నుంచి డిక్లేర్ – జనసేనతో బీజేపీ పొత్తు లేదు!



హైదరాబాద్,రాబోయే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. జనసేనతో సహా ఏ ఇతర రాజకీయ పార్టీతోనూ బిజెపికి పొత్తులు ఉండవని, రానున్న స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఢిల్లీలో అగ్రనేతలతో భేటీ తర్వాత పొత్తుల ప్రచారానికి తెరదించుతూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. తెలంగాణలో పార్టీ సొంత బలం మీద ఆధారపడి ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా అధిష్ఠానం వ్యూహరచన చేస్తోందని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో భాగంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి కలిసి పోటీ చేసి ఘనవిజయం సాధించాయి.

తెలంగాణలోనూ అదే ఫార్ములా అమలుమవుతుందని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్‌కు చెందిన జనసేన పార్టీతో బిజెపి మైత్రి కొనసాగుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, రెండు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, సమీకరణాలు వేర్వేరుగా ఉంటాయని తెలంగాణ బీజేపీ హైకమాండ్ నిర్ణయానికి వచ్చింది. ఏపీలోని రాజకీయ వాతావరణాన్ని తెలంగాణకు ముడిపెట్టడం సాధ్యం కాదని బిజెపి నాయకత్వం స్పష్టమైన అంచనాకు వచ్చింది.తెలంగాణలో బిజెపి తన సొంత కేడర్‌ను, ఓటు బ్యాంక్‌ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఢిల్లీ వర్గాలు భావిస్తున్నాయి. ఏదైనా పొత్తు పెట్టుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రెండింటినీ సమంగా ఎదుర్కొంటూ, ఏకైక నిజమైన ప్రత్యామ్నాయంగా నిలబడాలంటే ఒంటరి పోరాటమే సరైన మార్గమని బిజెపి అధిష్ఠానం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి.రామచందర్‌రావు చేసిన ఈ కీలక ప్రకటనతో తెలంగాణలోని ఇతర పొత్తు ఆశావహులకు గట్టి సంకేతాలు వెళ్లాయి. జనసేన సమక్షంతో గ్రేటర్ హైదరాబాద్ , సరిహద్దు జిల్లాల్లో లబ్ధి పొందుదామని భావించిన కొందరు స్థానిక నాయకులకు ఇది కొంత మింగుడుపడని విషయమే అయినప్పటికీ, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి సొంత శక్తితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిణామంతో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బహుముఖ పోటీ ఖాయంగా కనిపిస్తోంది. జనసేన కూడా పార్టీని బలోపేతం చేసుకునే దిశగా వెళ్తోంది.

# పిఎం మోడీని కలిసిన సాద్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్

న్యూఢిల్లీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని శిరోమణి అకాలీదళ్ (సాద్) అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శుక్రవారంనాడు కలుసుకున్నారు. ఢిల్లీలోని పార్లమెంటు హౌస్‌లో ఉభయులు భేటీ అయ్యారు. సమావేశం వివరాలు వెల్లడి కానప్పటికీ పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరు కలుసుకోవడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో పాత మిత్రపక్షాలు మళ్లీ ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో చేతులు కలిపే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు మొదలయ్యాయి.సాగు చట్టాల అంశంపై ఆరేళ్ల క్రితం ఎన్డీయే నుంచి 'సాద్' వైదొలిగింది. ఎన్డీయేలో 20 ఏళ్లుగా సాద్ కొనసాగింది.అయితే 2020లో మూడు వ్యసాయ చట్టాలను కేంద్రం తీసుకురావడంతో సాద్ విభేదించింది. మోదీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ఎన్డీయే నుంచి వైదొలిగింది. ఆ తదనంతర క్రమంలో బాదల్ భార్య, లోక్‌సభ ఎంపీ హర్‌సిమ్రత కౌర్ మోదీ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి అయ్యారు. గతంలో పంజాబ్‌లో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా, బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. అయితే ఈసారి మాత్రం



సమాన ప్రాతిపదికగానే పొత్తు ఉంటుందని బీజేపీ నాయకత్వం సంకేతాలు ఇస్తోంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు 2027లో జరుగనున్నాయి.

# ఆ ఐదుగురు మంత్రుల మార్పు తప్పదా...



తిరుపతి,ఏపీ మంత్రివర్గ విస్తరణ పై రకరకాల ప్రచారం నడుస్తోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్న తరుణంలో తప్పకుండా విస్తరణ జరుపుతారన్న ప్రచారం ఊపందుకుంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే సంక్రాంతికి అటు ఇటుగా విస్తరణ జరిగే అవకాశం ఉంది. అయితే ఓ ఐదుగురు మంత్రులపై కత్తి వేలాడుతోంది అనేది జరుగుతున్న ప్రచారం. ఏపీ మంత్రివర్గ విస్తరణ పై రకరకాల ప్రచారం నడుస్తోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్న తరుణంలో తప్పకుండా విస్తరణ జరుపుతారన్న ప్రచారం ఊపందుకుంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే సంక్రాంతికి అటు ఇటుగా విస్తరణ జరిగే అవకాశం ఉంది. అయితే ఓ ఐదుగురు మంత్రులపై కత్తి వేలాడుతోంది అనేది జరుగుతున్న ప్రచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ లోగా మొత్తం ఎన్నికలను పూర్తి చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అది జరిగిన తరువాత మంత్రివర్గ విస్తరణ జరగనుంది అనేది పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తున్న మాట. ప్రధానంగా ఓ ఐదుగురు మంత్రులు మార్పు ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వారి పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు టాక్ నడుస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీనియర్లతో కూడిన మంత్రివర్గం ఏర్పాటవుతుందని అంతా భావించారు. కానీ ఆ అంచనాలు తప్పుతూ.. జూనియర్లతో మంత్రివర్గం ఏర్పాటు చేశారు చంద్రబాబు. క్యాబినెట్లో ఉన్న 24 మందిలో పదిమంది కొత్తగా అసెంబ్లీకి ఎన్నికైన వారే. అయితే క్యాబినెట్ కూర్పుతో సీనియర్లు అసంతృప్తికి గురవుతారని అంతా భావించారు. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే ఈ జూనియర్ మంత్రుల టీం పనితీరు ఆశాజనకంగా లేదన్న అభిప్రాయం చంద్రబాబులో ఉంది. ప్రారంభంలో గట్టిగానే హెచ్చరికలు జారీ చేయడంతో అందరూ గాడిలో పడ్డారు. కానీ ఓ ఐదుగురు మంత్రులు మాత్రం ఇంకా పని తీరు పరంగా వెనుకబడి ఉన్నారు. ఆపై రాజకీయంగా కూడా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అందుకే వారిని మార్చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని చూస్తోంది. డిసెంబర్ లోగా దాదాపు ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముందుగా నిర్వహించాలని.. తరువాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని.. చివరిగా ప్రాదేశిక ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ఉండగా మంత్రివర్గ విస్తరణ చేపట్టడం అంత సహేతుకం కాదు అనేది ఒక అభిప్రాయం. అందుకే సంక్రాంతి తర్వాత.. వేసవి లోపల మంత్రివర్గ విస్తరణ చేపడతారని తెలుస్తోంది. అయితే ఐదుగురు మంత్రులను తొలగించి సీనియర్లకు ఛాన్స్ ఇస్తారని కూడా టాక్ నడుస్తోంది. ఫైల్ క్లియరెన్స్ చేయడంలోనూ.. ప్రతిపక్షాన్ని ధీటుగా ఎదుర్కోవడంలోనూ కొందరు మంత్రులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అటువంటి వారిని చంద్రబాబు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ వస్తున్నారు. కానీ వారి వైఖరిలో ఎటువంటి మార్పు లేదు. అందుకే విస్తరణలో వారి మార్పు అనివార్యమని తెలుస్తోంది.

# లోకేష్ పొగడ్తల వెనుక కథ ఏంటీ



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన అంశం.. మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కురిపిస్తున్న ప్రశంసల వర్షం. మైక్ దొరికినా, డిజిటల్ వేదికలైనా సరే.. అక్కడ స్పేస్ లేకపోయినా సరే.. స్పేస్ సృష్టించుకుని మరీ పవన్‌పై లోకేష్ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై తెలుగుదేశం పార్టీకి చెందిన కొంతమంది సోషల్ మీడియా కార్యకర్తల్లో అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సొంత పార్టీ కార్యకర్తలు తమ ఉనికి కోసం పోరాడుతుంటే, నేత మాత్రం మిత్రపక్ష నాయకుడికి ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటనే చర్చ నడుస్తోందిఈ అసంతృప్తి వెనుక ప్రధానంగా సోషల్ మీడియా పంచాయతీలు అతిపెద్ద కారణంగా కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైన్యాల మధ్య నిరంతరం తీవ్రమైన వార్ నడుస్తూనే ఉంటుంది. ఒక పార్టీ పోస్టలకు మరొక పార్టీ కౌంటర్లు ఇస్తూ, క్రెడిట్ వార్ నడుపుతుంటారు. సహజంగానే టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆద్యుడు, మార్గదర్శకుడు నారా లోకేష్ అనే భావన శ్రేణుల్లో బలంగా ఉంది. తాము సైబర్ యుద్ధం చేస్తుంటే, తమ నాయకుడే పవన్ కల్యాణ్‌ను అభినందిస్తూ పోస్టులు పెట్టడం, ఆయనను అనవసరంగా హైలైట్ చేస్తున్నారని భావించే కొంతమంది సోషల్ మీడియా శ్రేణులు నిరాశకు గురవుతున్నాయి.అయితే, సోషల్ మీడియా విభేదాలకు విరుద్ధంగా నారా లోకేష్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దాడి, సైబర్ యుద్ధాల వెనుక తన ప్రమేయం లేదని, కూటమి ఐక్యతకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేయడమే లోకేష్ ప్రధాన ఉద్దేశం. పార్టీల మధ్య మైండ్ గేమ్‌లు, శ్రేణుల మధ్య విభేదాలను అణచివేయకపోతే అది ప్రభుత్వ మనుగడకే ప్రమాదకరమని గ్రహించిన లోకేష్, పవన్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని, గౌరవాన్ని బహిరంగంగా చాటుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లోని సోషల్ మీడియా సైనికులకు ఒక పరోక్ష హెచ్చరిక సగటు సందేశంగా పంపుతున్నారు.రాజకీయాల్లో పొత్తులను సుదీర్ఘకాలం నడపడం, భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి మిస్ అండర్‌స్టాండింగ్స్ రాకుండా చూసుకోవడం కత్తిమీద సాము వంటిదే. గత అనుభవాలతో చిన్నపాటి కమ్యూనికేషన్ గ్యాప్ కూడా ప్రత్యర్థి పార్టీ అయిన వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా లాభిస్తుందనేది కూటమి పెద్దల వ్యూహం. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన సమయంలో పవన్ కల్యాణ్ చూపించిన చొరవ, ధైర్యాన్ని లోకేష్ తరచూ గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ పొగడ్త మాత్రమే కాకుండా, విశ్వసనీయతను కాపాడుకునే ప్రక్రియ. మరో కీలకమైన అంశం ఏమిటంటే, కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇమేజ్ అత్యంత ప్రాధాన్యమైనవి. చంద్రబాబు తర్వాత టీడీపీకి లోకేష్ భావి నాయకుడిగా ఎదిగే క్రమంలో.. జనసేనానితో సత్సంబంధాలు కాపాడుకోవడం భవిష్యత్ రాజకీయ స్థిరత్వానికి చాలా అవసరం. టీడీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యోధులను ఎంతమాత్రం విస్మరించకుండానే, పవన్ కళ్యాణ్ గౌరవానికి ఎక్కడా భంగం వాటిల్లకుండా లోకేష్ అడుగులు వేస్తున్నారు. శ్రేణుల మధ్య పోటీ తత్వం సహజమే అయినా, కూటమి ధర్మాన్ని నిలబెట్టుకోవడమే ప్రాథమిక లక్ష్యమని చాటడం ఇందులో అంతర్లీన వ్యూహం.నారా లోకేష్ అనుసరిస్తున్న ఈ పొగడ్తల వ్యూహం కేవలం వ్యక్తిగత అభిమానం కాక, ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో జరుగుతున్న చిన్నచిన్న పంచాయతీలను పక్కన పెట్టి, కూటమి బంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఏపీ ప్రభుత్వ స్థిరత్వానికి మూలస్తంభమని లోకేష్ స్పష్టం చేస్తున్నారు. కార్యకర్తల అసంతృప్తి తాత్కాలికమే అయినా, కూటమి మైత్రి నిలబడితేనే అధికారం సుస్థిరంగా ఉంటుందనే సందేశాన్ని ఆయన డిజిటల్ .రాజకీయ వేదికల ద్వారా సమర్థవంతంగా అందిస్తున్నారని అనుకోవచ్చు.

# జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా ధోవల్...


న్యూఢిల్లీ, అజిత్ ధోవల్.. జాతీయ భద్రతా సలహాదారు. భారత గూఢచార వ్యవస్థ ఇన్‌చార్జి. దేశ రక్షణే ధ్యేయంగా తన సర్వస్వం త్యాగం చేస్తున్నారు. ఎలాంటి ఆర్భాటాలు, ప్రచారం లేకుండా తన పని తాను చేసుకుపోతుంటారు. తాజాగా అజిత్ ధోవల్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆయన పాత్రను మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఇవి కేవలం ప్రశంసలు కాకుండా, నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ధోవల్‌పై ఉన్న విశ్వాసాన్ని, ఆయన పని తీరును ప్రతిబింబిస్తున్నాయి.అమిత్ షా 2014లో తన చీఫ్ సెక్రెటరీగా కూడా మొదటగా అజిత్ ధోవల్‌ను నియమించాలని భావించినట్లు తెలిపారు. ఇది ధోవల్‌పై ఉన్న అత్యధిక విశ్వాసాన్ని సూచిస్తుంది. సాధారణంగా చీఫ్ సెక్రెటరీ పదవి పరిపాలనా నైపుణ్యానికి సంబంధించినది. అయినా భద్రతా, గూఢచార రంగంలో అనుభవం ఉన్న వ్యక్తిని అలా పరిగణించడం, ఆయన సామర్థ్యం పరిపాలనా స్థాయిలోనూ విలువైనదిగా భావించబడిందని అర్థమవుతుంది.గుజరాత్‌లో వరుస బాంబు పేలుళ్లు జరిగిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షాను పిలిచి అజిత్ ధోవల్‌ను రప్పించాలని ఆదేశించారు. కేవలం పేలుళ్లపై ఉపరితల విచారణ చేయకుండా, ఘటన వెనుక ఉన్న మూల కారణాలు, నెట్‌వర్క్‌లను గుర్తించాలని సూచించారు. ధోవల్ గుజరాత్‌కు వచ్చిన తర్వాత జరిగిన దర్యాప్తులో గుజరాత్ పేలుళ్లకు సంబంధించిన వారితోపాటు సీరియల్ బాంబ్ బ్లాస్టలకు కారకులను కూడా పట్టుకోగలిగారు. ఇది ఆయన పని తీరులోని లోతైన విశ్లేషణ, సమన్వయ సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. సాధారణ పోలీసు విచారణ స్థాయిని మించి,



బహుళ కేసుల మధ్య సంబంధాలను ఏర్పరచి ఫలితాలు సాధించిన ఉదాహరణగా ఇది నిలుస్తుంది.అమిత్ షా ధోవల్‌ను ఎలాంటి ప్రచారం చేసుకోని వ్యక్తిగా వర్ణించారు. ఆయన శక్తి అంటే ఫలితాలు సాధించడమే తప్ప, మీడియా లేదా ప్రజా దృష్టిలో తనను తాను ప్రదర్శించుకోవడం కాదని స్పష్టమవుతుంది. భద్రతా రంగంలో ఇలాంటి తక్కువ ప్రొఫైల్, అధిక ప్రభావం కలిగిన వ్యక్తులు అరుదు. ఇది ధోవల్‌ను వ్యక్తిగత ప్రచారం కంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా చూపిస్తుంది.మొత్తంగా, అమిత్ షా వెల్లడించిన అంశాలు అజిత్ ధోవల్‌ను కేవలం అధికార పదవిలో ఉన్న వ్యక్తిగా కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో ఫలితాలు సాధించగల, ప్రచారం లేకుండా పని చేసే జాతీయ భద్రతా నిపుణుడిగా చిత్రీకరిస్తున్నాయి.

# పెండింగ్ సమస్యలపై ఉద్యోగ సంఘాల ఫైట్

విశాఖపట్టణం,ఆంధ్రప్రదేశ్‌లో గత కొంతకాలంగా మౌనంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మళ్లీ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సదుపాయాలు, పెండింగ్ బకాయిల పరిష్కారానికి సమయం ఇచ్చిన ఉద్యోగులు.. ఇప్పుడు తమ ప్రధాన డిమాండ్ల సాధనకు సమరశంఖం పూరిస్తున్నారు. 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి ప్రకటన, నిలిచిపోయిన కరువు భత్యం బకాయిల విడుదలపై కాలయాపన జరుగుతోందంటూ ఏపీ ఎన్జీవో , ఏపీ జేఏసీ అమరావతి వంటి ప్రధాన సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రెండేళ్లుగా నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, తమ ఆర్థిక, సర్వీసు హక్కుల సాధన కోసం ఇకపై ప్రత్యక్ష పోరాటాలు తప్పవని ఉద్యోగ నాయకులు హెచ్చరిస్తున్నారు.ఉద్యోగ సంఘాలు లేవనెత్తుతున్న డిమాండ్లలో 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించడంతో పాటు వేతన వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు వీలుగా తక్షణ ఐఆర్‌ను ప్రకటించడం అత్యంత కీలకమైనవిగా మారాయి. వీటితో పాటు పాత పెన్షన్ విధానం అమలు లేదా సీపీఎస్, జీపీఎస్ వివాద పరిష్కారం, ఎంప్లాయీస్ హెల్త్ కార్డ్స్ బగ్గుమంటున్న లోపాలు, ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పెంపుదలలు ప్రధాన ప్రతిబంధకాలుగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తమ వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించిన వేళ, ఏపీలో స్పష్టమైన గడువు లేకపోవడం ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసహనాన్ని నింపుతోందిఈ నిరసనలపై ప్రభుత్వం తరఫున ప్రతిస్పందనలు వెలువడుతున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం దాదాపు 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా సమావేశమై వారి 50కి పైగా డిమాండ్లను ఆలకించింది. పెండింగ్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని, పీఆర్సీ, ఐఆర్ విజ్ఞప్తులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, గత ప్రభుత్వం వదిలివెళ్లిన భారీ ఆర్థిక లోటు, రూ. వేల కోట్ల పెండింగ్ బిల్లుల భారం కారణంగా వెంటనే నిధులు కేటాయించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. రాజకీయ సమీకరణాల పరంగా పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల పాత్ర అత్యంత నిర్ణయాత్మకమైనది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీఆర్సీ అమల్లో జాప్యం, పోలీసు కేసుల నమోదు, పెండింగ్ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఉద్యోగ వర్గాలు కూటమి వైపు మొగ్గు చూపాయి. ప్రస్తుతం అదే ఉద్యోగులు మళ్లీ రోడ్డెక్కితే అది కూటమి ప్రభుత్వ రాజకీయ ఇమేజ్‌కు



పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం సామరస్యంగా ఇరువర్గాల మధ్య చర్చల ప్రక్రియను నిరంతరం కొనసాగించే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ ఉద్యోగ సంఘాల నిరసనలను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఎన్నికల ముందు ఉద్యోగులకు అసంఖ్యాక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక పీఆర్సీ, ఐఆర్ ఊసెత్తడం లేదు అని ఉద్యోగ సంఘాల డిమాండ్లకు మద్దతు ఇస్తూ, వారి నిరసనల ఆధారంగా రాజకీయాంశంగా మార్చేందుకు ప్రతిపక్షం వ్యూహరచన చేస్తోంది. సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్న 40 సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఆర్థిక శాఖ అధికారులను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు కలిశారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్పెషల్ ఛీఫ్ సెక్రెటరీ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణతో ఈ సాయంత్రం సమావేశమయ్యారు. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఇంతవరకూ అమలుకాలేదని వారికి వివరించారు. సెప్టెంబర్ 30లోగా సీపీఎస్‌పై నిర్నయం తీసుకుంటామని గతంలో చెప్పారని గుర్తు చేశాయి ఉద్యోగ సంఘాలు. డీఏల చెల్లింపునకు జీవోలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అమలుకాలేదన్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారనేదానిపై కూడా క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. డీఏ బకాయిలు చెల్లించకున్నా ఉద్యోగుల ఖాతాల నుంచి ఇన్‌కంట్యాక్స్ కట్ చేశారని ఆర్థికశాఖాధికారులకు ఉద్యోగులు తెలియజేశారు. పీఆర్సీ చర్చల్లో డీఏల ప్రస్తావన రాకున్నా రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని జీవోలు ఇచ్చారని... డీఏ బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని అధికారులను కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే త్వరలోనే కలిసొచ్చే ఉద్యోగ సంఘాలతో కార్యాచరణ రూపొందిస్తామని అల్టిమేటం ఇచ్చారు. నెల రోజుల్లో సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని సూచించారుఏపీ ఉద్యోగ సంఘాల ఉద్యమం కేవలం ఒక సర్వీసు డిమాండ్ల పోరాటంగా కాకుండా రాష్ట్ర రాజకీయ స్థిరత్వాన్ని

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140